క్లుప్తంగా

మాచవరంలో న్యాయవిజ్ఞాన సదస్సు



రొంపిచర్ల: మండలంలోని మాచవరం సచివాలయంలో మంగళవారం బాలకార్మిక నిర్మూలన చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. నరసరావుపేట మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జరిగితేనే వంద శాతం అక్షరాస్యత సాధ్యమవుతుందని ప్యానల్ న్యాయవాదులు అచ్చి ఏడుకొండలు, రామినేని ప్రసాద్ పేర్కొన్నారు. 14 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలబాలికలతో పనిచేయిస్తే ఆ సంస్థలపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ సదస్సుకు పారా లీగల్ వలంటీర్ గోదా రమేష్ కుమార్ అధ్యక్షత వహించారు.

సాతులూరులో జనభాగీదారి

నాదెండ్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సాతులూరు అంగన్‌వాడీ కేంద్రంలో జనభాగీదారి (అక్షరాశ్యతా పునాది) కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ హాజరై మాట్లాడుతూ, చిన్నారులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు అక్షరాభ్యాసంతో పాటూ ఆటపాటలు నేర్పాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం జనభాగీదారి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రమాదేవి, సీహెచ్ మాధవి, కల్పన, విజయలక్ష్మి, విజయ, స్కూల్ హెచ్‌ఎం మహమ్మద్ హిదయతుల్లా, ఏఎస్‌ఎంలు, పీజేకే రాజేశ్వరి, కావేరి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వినుకొండ (నూజెండ్ల): నూజెండ్ల మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీలో గల గాంధీనగర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో కనీసం 3 గంటలు పని చేయించాలని, గ్రామంలో కాలువలు శుభ్రంగా చేసుకోవాలని సూచించారు. ఏపీవో నాగేశ్వరరావు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య

బొల్లాపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించడమే జనబగీరథ ముఖ్య ఉద్దేశమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి తెలిపారు. మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి, రేమిడిచర్ల, మేళ్ళవాగు ఐసిడిఎస్ సెక్టార్ల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో జనభగీరథ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్లు పద్మజా రాణి, షేక్ మస్తాన్‌బి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బొల్లాపల్లి : మండలంలోని సీతారామపురం తండాలో సీతారాముల స్వామి దేవస్థాన మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు, వైఎస్సార్ సీపీ యువనాయకులు బొల్లా గిరిబాబు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పాఠశాలల్లో చేర్పించాలి

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుండి పునః ప్రారంభమైన నేపథ్యంలో ఉపాధ్యాయులు చిన్నారులను పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం గ్రామంలోని పరిసర కాలనీల్లో పర్యటించారు. ఆరో తరగతిలో చేర్చేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులతో పాటూ మధ్యాహ్న భోజన పథకం, జగనన్న విద్యా దీవెన కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు.

మృతురాలి నేత్రాలు దానం చేసిన బంధువులు

శావల్యాపురం:మండలంలోని వేల్పూరు గ్రామంలోని బీసీ కాలనీ వాసీ తలియాకుల శశికళ (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. అమ్మ నేత్ర శరీర అవయవ దాన ప్రోత్సాహక సంఘం పల్నాడు జిల్లా కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావుకు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. గుంటూరు పెదకాకాని శంకర కంటి వైద్యశాల ఐ బ్యాంకు సిబ్బంది డాక్టరు మయూరి తన సిబ్బంది ప్రత్యేక వాహనంతో వేల్పూరు గ్రామం సందర్శించి మృతురాలు శశికళ కంటిలోని కార్నియా పొరలను తీసుకున్నారు. తలియాకుల రాఘవేంద్రరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవికుమార్, శ్రీకాంత్, ఎస్.పరమేశ్వరరావులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

అధికారులు, కాంట్రాక్టర్లను కోరిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, కమిషనర్ రామ్మోహన్

నరసరావుపేట: పురపాలక పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లను కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో పలు వార్డుల్లోని పనులు, జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణ పనులు, టిడ్కో, పారిశుద్ధ్యం అంశాలపై సంబంధిత అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష చేశారు. వార్డుల వారీగా ఏయే పనులు మొదలు పెట్టారు.. ఇంకా మొదలు పెట్టాల్సిన పనులపై వార్డుల వారీగా వివరాలను ఏఈలను అడిగి తెలుసుకున్నారు. చేసిన పనులకు ఎంతవరకు కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేశారని ఏఈలు సువర్ణరాజు, నాయక్‌లను ప్రశ్నించారు. చేసిన పనులన్నింటికీ చెల్లింపులు చేశామని, మరికొన్ని మాత్రమే ఎంబుక్‌లు తయారీలో ఉన్నామంటూ జవాబిచ్చారు. చేపట్టాల్సిన సీసీరోడ్లు, డ్రైయిన్లు, చప్టాలను వెంటనే పూర్తిచేయాలని, నిధులకు కొరత లేదని కాంట్రాక్టర్లు, అధికారులకు చెప్పారు. అలాగే పట్టణ పరిధిలోని లబ్ధిదార్లకు వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ తీరుపై గృహనిర్మాణశాఖ డీఈ సత్యానారాయణను ప్రశ్నించారు. లబ్ధిదార్లకు అందజేసిన స్థలాల్లో ఆప్షన్ సీ కింద చేపట్టిన 1770 గృహాల్లో 700 గృహాల నిర్మాణం ప్రారంభమైందన్నారు. ఇక్కుర్రు లే ఆవుట్‌లో 1000 మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉండగా 500 గృహాలు మంజూరయ్యాయన్నారు. అప్రోచ్ రోడ్డు పూర్తికాగా ల్యాండ్ లెవలింగ్, స్టోన్ ప్లాంటేషన్ చేస్తున్నామన్నారు. దీనిపై టీపీవో మోహనరావు, టీపీఎస్ అనూరాధ మాట్లాడుతూ మిగతా 500 గృహాల డీపీఆర్ తయారీలో ఉన్నామన్నారు. జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్లు వేసేందుకు అధికారులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే కోరారు. వర్షాలు మొదలు కాకముందే బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణాలు తీసుకొస్తే ఆ తర్వాత నిర్మాణం చేసేందుకు సులభంగా ఉంటుందన్నారు. సమావేశంలో కమిషనర్ ఎం.రామ్మోహన్, ఎం.ఇ డి.శ్రీనివాసరావు, డీఇ ఓ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడి.. అమ్మఒడి!

- ఉప్పరపాలెంలో ఘనంగా అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే
- ఎల్‌కేజీ, యూకేజీ పూర్తయిన 20 మంది చిన్నారులకు సర్టిఫికెట్ల అందజేత
- పండుగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహణ



మాట్లాడుతున్న పీడీ అరుణ

యడ్లపాడు: బిడ్డకు తొలిగురువు అమ్మ అని.. అమ్మతన ఒడిలో ఆటపాటలతో బిడ్డకు నేర్పించిన విధంగా అంగన్‌వాడీ బడి ఉంటుందని పల్నాడు జిల్లా శిశుసంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ బి.అరుణ చెప్పారు. యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మంగళవారం గ్రాడ్యుయేషన్ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. అంగన్‌వాడీల్లో ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసుకున్న ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పీడీ అరుణ పాల్గొని మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారి మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. అప్పటి వరకు వారికి ఆటపాటలతో కూడిన ఇంగ్లిష్ మీడియంలోవిద్యా బోధన అందిస్తున్నట్లు వెల్లడించారు. కేవలం బోధనే కాకుండా క్రమం తప్పకుండా వారి ఆరోగ్య పరిరక్షణపై కేంద్రంలో కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తారన్నారు. పిల్లల్లో ఎత్తు, బరువులో వ్యత్యాసం, రక్తహీనత లోపాలను లేకుండా చూసేలా ప్రతినెలా కొలతలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే వారికి మంచి పోషకాహారం కేంద్రం ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఐదేళ్ల పూర్తికాగానే ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పించే ఈ సదవకాశాలను గ్రామీణ ప్రాంతాల చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీపీవో జి.శాంతకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీల్లోని బాలబడులను ఇకపై వైఎస్సార్ ప్రీప్రైమరీ స్కూల్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ ఝాన్సీ గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు తమ పిల్లలకు మూడే సంవత్సరాలు నిండిన వెంటనే సమీప అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. గ్రాడ్యుయేషన్‌లో పంపిణీ చేసే సర్టిఫికెట్లు ఒకటో తరగతి ప్రవేశాలకు దోహదపడతాయన్నారు. అనంతరం రెండు అంగన్‌వాడీల్లో పీపీ–1, పీపీ–2 పూర్తి చేసిన 20 మంది చిన్నారులకు గ్రాడ్యుయేషన్ తరహాలో సర్టిఫికెట్లను అతిథులు అందించారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కీర్తి అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు ఏసీడీపీవో బి.నిర్మలారాణి, సూపర్‌వైజర్లు ఎం జోజమ్మ, ఎం.వాణి, వీవీ సుబ్బాయమ్మ, బీఆర్ కోటేశ్వరి, సెక్టార్ పరిధిలోని అన్ని ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, గ్రామపెద్దలు హాజరయ్యారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండరోడ్డు శ్రీనివాసనగర్‌లో వేంచేసియున్న శ్రీగోదా పద్మావతి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉభయ దేవేరులతో శ్రీవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి స్వామివారి కల్యాణం జరిపారు. వేద పండితులు చిలకపాటి విజయరాఘవాచార్యులు పర్యవేక్షణలో ఋుత్విక్కులు సాతులూరి లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో అర్చకస్వాములు శ్రీవారి కల్యాణం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం శ్రీగోదా పద్మావతిదేవి సమేతంగా శ్రీవారు తిరువీధి ఉత్సవంలో పాల్గొని భక్తులను అనుగ్రహించారు. కాగా బుధవారం శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్నట్టు అర్చకులు తెలిపారు.

వైఎస్సార్ యంత్రసేవను సద్వినియోగం చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా అందజేసిన యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకునేలా రైతులను చైతన్య పర్చాలని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు ఇచ్చిన పరికరాల వివరాలను యాప్‌లో నమోదుపై గ్రామ వ్యవసాయ సహాయకులకు సబ్ డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటి చేసే దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు యంత్రపరికరాలను అందజేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంత్రసేవా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వం అందజేసిన యంత్ర పరికరాల వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకుల చేత యాప్‌లో నమోదు చేయించారు. అలాగే ఇప్పటివరకు అద్దెకు ఇచ్చిన వస్తు వుల వివరాలను నమోదు చేశారు. మండల వ్యవసాయ అధికారులు హరిప్రసాద్, సరిత, విజయభాస్కర్, శ్రీలత, ఏఈఓలు బ్రహ్మయ్య, గోపిరెడ్డిలు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

వినుకొండ టౌన్: పేద కుటుంబాలలోని చిన్నారుల చదువుకు ఏ కుటుంబం ఇబ్బంది పడకూడదనే సదుద్దేశ్యంతో, ఉచిత విద్యతోపాటు అవసరమైన మెటీరియల్‌ను జగనన్న విద్యా కానుక కిట్ల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అందించడం జరుగుతుందని 23వ వార్డు కౌన్సిలర్ నన్నేసా పేర్కొన్నారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 10వ వార్డు పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు కానాల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందించిన పుస్తకాలు, బ్యాగులు, మూడు జతల యూనిఫారంలు, బూట్లు, సాక్సులను అందించి, మిఠాయిలను చిన్నారులకు పంచి ఆయన శుభాకాంక్షలు తెలియచేశారు. ఉపాధ్యాయులు కరిముల్లా, లక్ష్మీనారాయణ, రమణ, శ్రీదేవి, దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు భరోసా సాయం

ఈపూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెంది సొంత పొలం లేని రైతులు కౌలు రైతు కార్డు ద్వారా రైతు భరోసా సాయం కూడా పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి ఆర్. రామారావు తెలిపారు. మండలంలోని కొండాయపాలెం, వనికుంట గ్రామ సచివాలయాల్లో కౌలుదారుల అవగాహన సదస్సులో భాగంగా కౌలు రైతులతో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, మండల ఎంపీపీ శాకమూరి బుచ్చయ్య, కొండాయపాలెం గ్రామసర్పంచ్ కేతినేని వెంకట్రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.గణేష్, కె.ఆనంద్‌బాబు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

షాహీ మసీదు భూములకు కౌలు వేలం

నాదెండ్ల: సాతులూరు 1వ సచివాలయంలో మంగళవారం షాహీ మసీదు భూముల బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. కౌలు వేలానికి వక్ఫ్ బోర్డ్ జిల్లా ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లా బాషా, తహసీల్దార్ ఏవీ రమణ హాజరయ్యారు. 84 ఎకరాల భూమికి గాను రూ.10 వేలు ధరావత్తు చెల్లించి 10 మంది వేలంలో పాల్గొన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకూ వేలం కొనసాగింది. గ్రామానికి చెందిన కోటా ఏలియా ఏడాదికి ఎకరాకు రూ.10,500ల చొప్పున వేలంలో హెచ్చుపాటదారుగా నిలిచాడు. పాట ముగిసే సమయానికి అదే గ్రామానికి చెందిన దావల సోమయ్య రూ.10,600లు అనే లోపే పాట ముగిసిందని అధికారులు పాట నిలిపివేశారు. దీంతో సోమయ్య అధికారులతో వాగ్వాదానికి దిగాడు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, ఉన్నతాధికారుల నిర్ణయం ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో అంజలి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వీరాంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా పి.వీరాంజనేయులును ప్రభుత్వం నియమించింది. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.వీరాంజనేయులును వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసులు అద్దంకి బదిలీ అయ్యారు.

కౌలుదారుల అవగాహన సదస్సు

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు రైతుభరోసా కేంద్రంలో ఖరీఫ్ సాగుకు కౌలుదారుల అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఏఈవో పురేటి అశోక మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ కౌలు భూమిని సాగుచేయు ప్రతి కౌలుదారుడు పంట సాగు ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు. వీఆర్వో సత్యానందం, రైతుభరోసా వీఏఏ ఒంటేరు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు దావులూరి సంపూర్ణ పాల్గొన్నారు.

గొర్రెల మందపై వీధికుక్కల దాడి

నాదెండ్ల: గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో మూడు గొర్రెలు మృతి చెందగా, మరో 14 గొర్రెలు గాయాలపాలైన సంఘటన సోమవారం అర్ధరాత్రి కనపర్రు గ్రామంలోని ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. జీవాల రైతు పీలా వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు తనకు 17 జీవాలు ఉన్నాయని, వీటిని షెడ్డులో ఉంచామని, అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కల గుంపు షెడ్డులో చొరబడి గొర్రెల మందపై దాడి చేశాయన్నారు. దీంతో మూడు గొర్రెలు మృతి చెందగా, 14 గొర్రెలు గాయాలయయ్యాయని, వీటిని కొన్ని గొర్రెల పరిస్థితి విషమంగా ఉందన్నారు. పశువైద్యాధికారి వద్ద వైద్యం చేయిస్తున్నట్లు తెలిపాడు. సుమారు రూ.1.70 లక్షల వరకూ తనకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. గ్రామ పంచాయతీ అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరాడు.

పథకాల సమాచారం దగ్గర ఉండాలి

బొల్లాపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు సమాచారం ఉండాలని మండల ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ షేక్ జిలానీ బాషా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన ఉండే విధంగా సచివాలయాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ బీమా పథకం గురించి చర్చించారు.

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

శావల్యాపురం: ఖరీఫ్ సాగుకు రైతులందరు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై అన్నీ రైతుభరోసా కేంద్రాల్లో ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏవో మాట్లాడుతూ మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట సాగు చేయు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిలుగులు 10 కేజీల సంచి రూ. 395లు, జనుము రూ. 420లు పిల్లిపెసర విత్తనాలు 8 కేజీల సంచి రూ.388లు అందజేస్తున్నట్లు చెప్పారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయటం ద్వారా భూమి సారవంతంగా గాను అన్నీ పోషకాలు కల్గియుంటాయన్నారు.